క్లుప్తంగా

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

మునిపల్లి(అందోల్): ప్రభుత్వ అనుమతి లేకుండా డబ్బవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ తెన్‌మొళి హెచ్చరించారు. మండల పరిధిలోని బోడపల్లి, మన్‌సాన్‌పల్లి, తాటిపల్లి డబ్బవాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో మంగళవారం ఆర్‌ఐ రవీందర్‌రావుతో విచారణ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొందరు రాత్రి సమయంలో డబ్బవాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు తమకు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే జైలుకు పంపుతామని హెచ్చరించారు.

నిధుల మంజూరుపై హర్షం

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనుల కోసం టీయూఎఫ్‌ఐడీసీ ద్వారా రూ.20 కోట్లు మంజూరు చేసినందుకుగాను మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి చిత్రపటాలకు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. కౌన్సిలర్లు వివేకానంద్, నర్సింహులు, మాజీద్, సద్దాం, రామకృష్ణ, హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలంలోని అంతర్‌గాంకు చెందిన సునీతకు మంగళవారం ఎల్‌ఐసీ సంస్థ తరఫున రూ.2.35 లక్షల బీమా చెక్కు అందజేశారు. అంతర్‌గాంకు చెందిన రైతు శేరి గోవర్ధన్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో మరణించారు. దీంతో ఎల్‌ఐసీ సంగారెడ్డి బ్రాంచ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జీవిత బీమా కుటుంబ సభ్యులకు భరోసాను కల్పిస్తుందని తెలిపారు. ఆయన వెంట ఎల్‌ఐసీ ఏజెంట్ రాజేందర్‌పాటిల్ ఉన్నారు.

న్యాల్‌కల్ తహసీల్దార్ మృతి


భానుకిరణ్ (ఫైల్)

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ తహసీల్దార్ భానుకిరణ్ అనారోగ్యంతో మృతి చెందాడు. కొన్ని రోజులుగా అస్వస్థతతో బాధపడుతున్నాడు. ఇటీవల హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేరగా చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచాడు. భానుకిరణ్ వనపర్తి జిల్లా కొత్త కోట ప్రాంతానికి చెందినవాడు. వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించిన ఆయన గత డిసెంబర్ 6న న్యాల్‌కల్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.

వ్యక్తి అదృశ్యం

జిన్నారం: కూలి పని చేసేందుకు ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన గుమ్మడిదల మండల పరిధిలోని దోమడుగు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో నివాసముంటున్న సయ్యద్ జహంగీర్ అదే గ్రామానికి చెందిన శోభన్‌బాబు వద్ద పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజుల క్రితం ఎప్పటిలాగే పనిచేసేందుకు వెళ్లిన సయ్యద్ జహంగీర్ తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతోమ జహంగీర్ భార్య రేష్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంపీఓ శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. పుల్‌కల్ మండల కేంద్రంలో పలు వార్డులను పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నూతన విద్యా విధానం రద్దు చేయాలి


మాట్లాడుతున్న నాగరాజు

సంగారెడ్డి అర్బన్: నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అంబేడ్కర్ భవన్‌లో జిల్లా సదస్సును ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. సదస్సుకు ముఖ్య వక్తలుగా ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నాగరాజు, వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో అధికారంలోకి రాకముందు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మాట తప్పిందన్నారు. విద్యారంగాన్ని బ్రష్టు పట్టించే విధంగా కార్పొరేట్‌కు అప్పచెప్పే విధంగా జాతీయ విద్యా విధానాన్ని 2020ని తీసుకువచ్చిందని మండిపడ్డారు. ఎస్‌ఎఫ్‌ఐ మాజీ అధ్యక్షుడు అతివేల మాణిక్యం, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అనిల్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు మహేష్, ఉపాధ్యక్షుడు సతీష్, గర్ల్స్ కన్వీనర్ వాణి, కోకన్వీనర్ సాక్షి, నాయకులు పాల్గొన్నారు.

ఓటు ప్రాధాన్యం తెలిసేలా..

- మాక్ పోలింగ్ ద్వారా విద్యార్థులకు అవగాహన
- 52 పాఠశాలలు, 8 కళాశాలల్లో కార్యక్రమాలు పూర్తి
- స్వీప్ ఆధ్వర్యంలో ఎలక్షన్ నిర్వహణపై అవగాహన


ఓటు హక్కును వినియోగించుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉంది. భావిపౌరులకు ఎన్నికల సరళిపై అవగాహన కల్పించడానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ శ్రీకారం చుట్టింది. ఎన్నికల సంఘం ఆదేశాలతో 14 నుంచి 17 ఏళ్ల లోపు విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన, చైతన్యం కల్పించడానికి స్వీప్(సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోల్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం) కార్యక్రమం చేపట్టారు. కలెక్టర్ ఆదేశాలతో విద్యాశాఖ ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో పాఠశాలలు, ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలో ఎలక్ట్రోల్ లిట్రసీ క్లబ్ ఏర్పాటు చేశారు. ఓటుహక్కు ప్రజాప్రతినిధుల ఎన్నిక విధానం, ఎలక్షన్ నిర్వహణ, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన వంటి అంశాలను భవిష్యత్తు ఓటరు మరింత లోతుగా తెలుసుకునేందుకు ఈ క్లబ్ దోహదం చేస్తుంది. ఓటరు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకునేలా విద్యార్థి దశలో చేతనం కల్పించడమే (ఈఎల్‌సీ)ల ప్రధాన ఉద్దేశం. స్వీప్ నోడల్ అధికారిని జ్యోతిరెడ్డి, మాస్టర్ ట్రైనర్ అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం ఓటు ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన

పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలతో పాటు మెడికల్ డీగ్రీ కళాశాలలో స్వీప్ కార్యక్రమాలు చేపట్టారు. ప్రస్తుతం ఐక్యరాజ్యసమితి, మార్క్ పార్లమెంట్, పోలింగ్, మోడల్ పోలింగ్ స్టేషన్, ఎన్నికల అధికారులు బీఎల్‌ఓల గురించి వివరిస్తున్నారు. విద్యార్థులు ఓటర్లుగా నమూనా పోలింగ్‌లో తమ ప్రతినిధులు (ప్రజాప్రతినిధుల తరహాలో)ను ఎన్నుకునేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి పాఠశాల, కళాశాలలో ఐదుగురు బాల, బాలికల సభ్యులుగా, మరో బ్రాండ్ అంబాసిడర్, మిగతా వారంతా సభ్యులుగా ఈఎల్‌సీలు ఏర్పాటు చేశారు. వీటిలో పాఠశాల స్థాయిలో 9, 10 తరగతి ఇంటర్మీడియట్‌లో ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఉంటారు.



సంతోషంగా ఉంది

ఎన్నికల నిర్వహణ ఎలా జరుగుతుందో ప్రత్యక్షంగా తెలుసుకున్నాం. పోలింగ్ కేంద్రం నిర్వహణ, ఎన్నికల అధికారులు, సిబ్బంది విధులు, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై స్వీప్ కార్యక్రమం ద్వారా తెలుసుకున్నాం. మాక్ పోలింగ్‌లో ఓటు వేసి ఓటుహక్కును వినియోగించుకున్నందుకు సంతోషంగా ఉంది.

– పూజ, 8వ తరగతి, ప్రభుత్వ పాఠశాల

అవగాహన కల్పిస్తున్నాం



స్వీప్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలుచేసి పర్యవేక్షిస్తున్నాం. నియోజకవర్గ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలో ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులకు సంపూర్ణంగా అవగాహన కల్పిస్తున్నాం. మాక్ పార్లమెంట్, ఓటింగ్ ప్రక్రియపై మాక్ పోలింగ్ నిర్వహిస్తున్నారు.

– స్వీప్ నోడల్ ఆఫీసర్, అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి

సంకల్పపత్రం తీసుకున్నాం



పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో 162 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సంకల్ప పత్రాన్ని తీసుకున్నాం. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు పోలింగ్ రోజు ఓటింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. గతంలో కన్నా ఓటింగ్ శాతం పెరుగుతుందని ఆశిస్తున్నాం.

– మాస్టర్ ట్రైనర్, అమరేందర్‌రెడ్డి

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి


జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన మహిళా సదస్సులో పాల్గొనేందుకు ఖేడ్ డివిజన్ పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలు పలు బస్సుల్లో తరలివెళ్లగా ఎమ్మెల్యే జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాల్లోని మహిళలకు వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరిట మంజూరు చేయడంతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, మహిళల పేరిటే ఇందిరమ్మ ఇళ్ల మంజూరును పునరుద్ధరించిందన్నారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్‌చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు వివేకానంద్, నర్సింహులు, మాజీద్, ఐకేపీ ఏపీఎం టిక్యానాయక్, తాహెర్‌అలీ, శంకర్ ముదిరాజ్, కిషన్‌నాయక్ రాథోడ్ పాల్గొన్నారు.

ఆ పండుగలకు జనరల్ ఫండ్ నిధులా?

రూ.5లక్షలు కేటాయించడంపై కౌన్సిలర్ల అభ్యంతరం


మాట్లాడుతున్న కౌన్సిలర్ దుర్గేష్

జోగిపేట(అందోల్): బతుకమ్మ, దసరా పండుగల కోసం జనరల్ ఫండ్ నుంచి రూ.5 లక్షలు ఎలా ఖర్చు పెడతారని కౌన్సిలర్లు దుర్గేష్, నాగరాజు ప్రశ్నించారు. జోగిపేట మున్సిపల్ సర్వసభ్య సమావేశం చైర్మన్ మల్లయ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో 18 అంశాలకు సంబంధించి తీర్మానాలు ప్రవేశపెట్టగా అందులో గత ఏడాది బతుకమ్మ, దసరా పండగలకు జనరల్ ఫండ్ రూ.5 లక్షలు కలుపుకొని రూ.15 లక్షలు ఖర్చుపెట్టడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ కౌన్సిలర్ భవానీ అడ్డు తగులుతూ రెండు పండగలను మున్సిపల్ నిధులతో ఘనంగా నిర్వహించామన్నారు. పనులు చేయకుండా నిధులు అడగడంలేదని అనడంతో చేపట్టిన పనులకు బిల్లులు ఎక్కడ ఉన్నాయని కౌన్సిలర్ దుర్గేష్ ప్రశ్నించారు. మోటారు రిపేరుకు, ఇతర చిన్న చిన్న పనులకు కనీసం రూ.40, 50వేలు అడిగితే జనరల్ ఫండ్‌లో ఏమి లేవని చెప్పే అధికారులకు రూ.లక్షలు ఎక్కడినుంచి వచ్చాయని ప్రశ్నించారు. తాము చేపట్టిన పనులకు బిల్లులు ఇప్పించాలని కోరగా ఏఈతో రికార్డు చేయించుకోవాలని, ప్రస్తుతం మున్సిపాలిటీకి కొత్త ఏఈ వచ్చినట్లు చైర్మన్ మల్లయ్య సమాధానం ఇచ్చారు. పట్టణంలోని చౌరస్తాల్లో ఉన్న ఫ్లడ్ లైట్లు వెలగడం లేదని, అంబేడ్కర్ చౌరస్తా వద్ద చీకటిగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని కౌన్సిలర్‌లు తెలిపారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, సురేష్, రేఖా ప్రవీణ్, భవానీ, చందర్‌నాయక్, భారతి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


వావిలాలలో కల్వర్టు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాల అభివృద్దే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. జిన్నారం మండలంలోని వావిలాల, అండూర్, జంగంపేట గ్రామాల్లో రూ.76లక్షలతో నిర్మించనున్న కల్వర్టు పనులకు మంగళవారం శంకుస్థాపనలు చేశారు. అనంతరం లక్ష్మీపతిగూడెంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ దేవాలయాన్ని ఎమ్మెల్యే సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలను కలుపుతూ చేపడుతున్న కల్వర్టుల నిర్మాణంతో రవాణా సౌకర్యం సులభంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ రవీందర్‌గౌడ్, నాయకులు, గ్రామాల ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ తల్లికి పూజలు

పటాన్‌చెరు: మండల పరిధిలోని పోచారం గ్రామ పరిధిలోని పోచారంలో నిర్వహించిన రేణుకా ఎల్లమ్మతల్లి జాతరలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, సీనియర్ నాయకులు కోడూరి భిక్షపతి, భిక్షపతి, శ్రీశైలంగౌడ్, గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

స్కూటీ, టిప్పర్ ఢీ..

- యువకుడు మృతి

పటాన్‌చెరు టౌన్: స్కూటీని టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ పాషా తెలిపిన వివరాల ప్రకారం.. గచ్చిబౌలికి చెందిన నీరుడి సందీప్ సాగర్(25)(డెలివరీ బాయ్) అతడి స్నేహితుడు మణి ఇరువురు స్కూటీపై రామచంద్రపురం మండలం నందిగూడెం వైపు నుంచి నాగులపల్లికి వస్తుండగా కొల్లూరు ఓఆర్‌ఆర్ సమీపంలో ఎదురుగా వస్తున్న టిప్పర్ స్కూటీని ఢీకొట్టింది. దీంతో సందీప్ సాగర్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతని స్నేహితుడు మణికి గాయాలు కావడంతో చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి వసంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక సేవలో ముందుండాలి

జహీరాబాద్ టౌన్: సామాజిక సేవలో ముందుండాలని తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి సంగప్ప అన్నారు. సేవా కార్యక్రమాలు చేపడుతున్న గోపాల్, బరూర్ దత్తాత్రి, శ్రీశైలం, రవికుమార్, శేఖర్, రాజు, మచ్చెందర్, బేతాలుడు, మల్లికార్జున్, రఘును మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంగప్ప మాట్లాడుతూ సామాజిక సేవలో ఉండే ఆనందం ఎందులోనూ ఉండదన్నారు. జహీరాబాద్‌కు చెందిన పలువురు ముదిరాజ్ బిడ్డలు వృత్తి ధర్మం పాటిస్తూ సమాజ సేవలో ముందుండటం అభినందనీయమన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకురావాలని సూచించారు. గోపాల్, బరూర్ దత్తాత్రి, శ్రీశైలం, రవికుమార్, శేఖర్, రాజు, మచ్చెందర్, బేతాలుడు, మల్లికార్జున్, రఘును సన్మానించారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని సిరిపురం జిల్లా పరిషత్ పాఠశాలలో చర్ల మాణయ్య జ్ఞాపకార్థం చర్ల మాణయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పెన్నులు, పరీక్షా ప్యాడ్స్ పంపిణీ చేశారు. మణిదీప్ సందీప్, శ్రీనివాస్, నవోజులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 1000 పరీక్షా ప్యాడ్లను వాసవీ మా ఇల్లు సేవా సంస్థ ఆధ్వర్యంలో జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ శ్రీమహేశ్వరశర్మ సిద్ధాంతి చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు గౌసోద్దీన్, వాసవీ మా ఇల్లు సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి ప్రకాష్, కోశాధికారి విజయ్ సభ్యులు సుధాకర్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కష్టమూర్తి, వాసవి క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు చందా శ్రీధర్, అధ్యక్షుడు బీబీపేట వెంకటేశం, కౌన్సిలర్ సంతోష్ పాల్గొన్నారు.

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండల కేంద్రంలోని ఎస్టీ వసతి గృహం టెన్త్ విద్యార్థులకు తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం(టీబీఎస్) సంఘం ఆధ్వర్యంలో పరీక్షా ప్యాడ్స్, పెన్నులు, పెన్సిళ్లను అందజేశారు. టీబీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తులసీరాం రాథోడ్, నాయకులు అర్జున్‌చవాన్, హీరాలాల్, దేవిసింగ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

కొండాపూర్(సంగారెడ్డి): రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి నర్సింగరావు తెలిపారు. మంగళవారం కొండాపూర్‌లోని రైతు వేదికలో రైతునేస్తం కార్యక్రమానికి సంబంధించి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ సుచరిత మామిడి పంటలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసోసియేట్ డైరక్టర్ ఆఫ్ రీసెర్చ్ శ్రీనివాస్, డాక్టర్ ప్రగతి ఏడీఏ మనోహర, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని మల్లారెడ్డిపేట గ్రామంలో సీసీ రోడ్డు పనులను గ్రామపెద్దలు మంగళవారం ప్రారంభించారు. సురేష్, మొగులయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ సిద్దార్థ్ కుటుంబానికి న్యాయం చేయాలి

సంగారెడ్డి అర్బన్: కేరళ వెటర్నరీ, అనిమల్ హస్బెండ్రీ యూనివర్సిటీలో రెండో సంవత్సరం చదువుతున్న సిద్దార్థ్ దారుణ హత్యకు కారణమైన ఎస్‌ఎఫ్‌ఐ గుండాలను కఠినంగా శిక్షించాలని సంగారెడ్డి జిల్లా కన్వీనర్ ఆకాష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సంగారెడ్డి శాఖ ఆధ్వర్యంలో ఎస్‌ఎఫ్‌ఐ గుండాల దిష్టిబొమ్మను సంగారెడ్డి పట్టణంలోని ఐబీ వద్ద దహనం చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి, దినేష్, శశాంక్, తానాజీ, వెంకట్, శివ, భాను ప్రకాష్, మహేష్ పాల్గొన్నారు.

◆ వీడియో కాన్ఫరెన్స్‌ను తిలకించిన రైతులు

రాయికోడ్(అందోల్): రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను రైతులు తిలకించారు. రాయికోడ్ రైతువేదికలో ఏర్పాటు చేసిన స్క్రీన్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు సూచనలు చేశారు. మండల వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ, ఏఈఓ యాదయ్య పాల్గొన్నారు.

◆ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ ఎన్నిక

జిన్నారం(పటాన్‌చెరు): పటాన్‌చెరు డివిజన్ పరిధిలో విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్–82 కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ పటాన్‌చెరు అధ్యక్షులుగా అనిల్‌బాబు, కార్యదర్శిగా వెంకటేశ్, గుమ్మడిదల అధ్యక్షుడిగా సుధాకర్, కార్యదర్శిగా నాగేందర్, రామచంద్రాపురం అధ్యక్షుడిగా శివకుమార్, కార్యదర్శిగా రామకృష్ణ, బొల్లారం అధ్యక్షుడిగా రమేశ్, కార్యదర్శిగా అజయ్, కమిటీ కార్యవర్గంతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

◆ భూసమస్యలను పరిష్కరించాలి

నారాయణఖేడ్: ధరణిలో భూసమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమెల మాణిక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఖేడ్ తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ ఖేడ్ డివిజన్ నాయకులు అరుణ్, మోషప్ప, సతీష్, రాములు, హరిపాల్, సంతోష్, సాయిలు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ విశ్రాంత ఉద్యోగుల విహారయాత్ర

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రామచంద్రాపురం మండల శాఖ అసోసియేట్ అధ్యక్షులు తడక నాగభూషణం అధ్వర్యంలో మంగళవారం విహారయాత్రకు వెళ్లారు. కార్యక్రమంలో సంఘం ప్రముఖులు బసవరాజు, ప్రతాపరెడ్డి, మధుసూదన్ శర్మ, సుభాష్ రెడ్డి, చక్రపాణి, విఠలచార్యులు పాల్గొన్నారు.

◆ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్ప అన్నారు. రామచంద్రాపురం పట్టణంలోని పాషాకాలనీలో కాల్వర్టు వద్ద డిసిల్టింగ్ పనులను మంగళవారం ప్రారంభించారు. నాయకులు కిరణ్‌గౌడ్, కంది శ్రీను, శ్రీను, రాములు యాదవ్, సంపత్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ పేదలకు అండగా కాంగ్రెస్ పార్టీ

పటాన్‌చెరు టౌన్: పేదల పక్షాన అండగా నిలిచే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు నర్సింహారెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదలకు ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభించిన సందర్భంగా జీహెచ్‌ఎంసీ కార్యాలయం ఎదుట పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహిళలతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. డీసీసీ కార్యదర్శి సమ్మయ్య, నాయకులు అతిక్, కిషన్, పాషా, అసిఫ్, జ్యోతి, లక్ష్మీ, ప్రమీల, రాణి, కళ, వెంకట్‌రావ్, హనుమంతు, సంతోష్, మధు పాల్గొన్నారు.

◆ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని వేకువా ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు చంద్రశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వేకువా ఫౌండేషన్ అధ్వర్యంలో మంగళవారం చీకూర్తి పాఠశాలలో సమయ పాలన, గోల్ సెట్టింగ్, మెమోరీ సెట్టింగ్, శ్రద్ధ, మానవత్వం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హేమంత్‌కుమార్, ఉపాధ్యాయులు పూర్ణచందర్‌రావు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఘనంగా కుటుంబ సమ్మేళనం

జహీరాబాద్ టౌన్: సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని సాయినగర్ గణేష్ మండపంలో మంగళవారం కుటుంబ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి ప్రధాన వక్తగా సమరసతా తెలంగాణ కన్వీనర్ అప్పాల ప్రసాద్ హాజరై మాట్లాడారు. భారతీయ కుటుంబ వ్యవస్థ, కుటుంబ సమాజంలో సమరసతా ఆవశ్యకతను వివరించారు.ప్రముఖులు సాయిరెడ్డి విఠల్‌రెడ్డి, వీరేశం పాల్గొన్నారు.

◆ ఘనంగా స్వయంపాలన దినోత్సవం

నారాయణఖేడ్: మండలంలోని రుద్రారం ప్రాథమికోన్నత పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ..

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని గుంతపల్లి పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు విశ్వేశ్వర, జమునరాణి, శకుంతల, సురేష్, గాయత్రి పాల్గొన్నారు.

కల్హేర్‌లో...

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండలం.. మునిగేపల్లి ఎంపీపీఎస్‌లో స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో టీచర్లు శ్రీరామ్‌నాయక్, నారాయణసింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ విద్యుత్ కనెక్షన్ తొలగింపు ఇంటి పాత మీటర్ కష్టాలు!

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని ముచ్చర్ల గ్రామానికి చెందిన చిత్తారి సిద్దయ్య 12 ఏళ్ల క్రితం మృతి చెందాడు. గ్రామంలోని ఆయన గృహానికి ఉన్న విద్యుత్ మీటర్ అప్పట్లో కాలిపోయింది. అయినా నెలనెలా కరెంటు బిల్లు వస్తూనే ఉంది. ప్రస్తుతం అదే ఇంటిలో ఉంటున్న సిద్దయ్య కుటుంబీకులు మీటర్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే పాత మీటర్ బిల్లు కడితేనే కొత్త మీటర్ మంజూరు చేస్తామని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ఓవైపు గృహ అవసరాలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందజేస్తామని ప్రభుత్వం ప్రకటన చేస్తే.. విద్యుత్ అధికారులు మాత్రం కనీసం మీటరు మంజూరుకు కొర్రీలు పెడుతున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

◆ ప్రమాదాలపై సమగ్ర విచారణ చేయాలి

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి జిల్లాలో పరిశ్రమల్లో వరుసగా జరుగుతున్న ప్రమాదాలపై విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజయ్య, మాణిక్యం, నాయకులు రమేష్, కృష్ణ పాల్గొన్నారు.

◆ గ్రామాల అభివృద్ధికి కృషి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని వెంకటాపూర్ ఎంపీటీసీ ఒగ్గు శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని ఇశ్రితాబాద్ గ్రామంలో మంగళవారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రంజిత్ కుమార్, గౌరెల కాపరి సొసైటీ చైర్మన్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.